# చిటికెలలో పందిరి

శ్రీమతి జి. రామలక్ష్మి, హైద్రాబాదు.

ఒక గ్రామంలో పేరమ్మ అనే ఒక ఆమె ఉంది. ఆమెకు చాలాకాలం వరకు సంతానం కలగలేదు! ఒకరోజు ఆమె దగ్గరలోనున్న కృష్ణుడి గుడికి వెళ్లి, "స్వామీ, నాకు కనక కొడుకుని ప్రసాదిస్తే, నీ పేరు వాడికి పెట్టుకుని, నీకు చిటికెలలో ఈ ఆవరణ అంతా పందిరి వేసేస్తాను. నామాట నిజం! నన్ను నమ్ము స్వామీ. ఇక నీ మహిమ చూపడమే తరువాయి!" అంటూ దణ్ణం పెట్టుకుంటూ మొక్కుకుంది.

అది విని కృష్ణుడు "పిసినిగొట్టుగా పేరు బాగా గడించిన ఈ పేరమ్మ 'చిటికెలలో పందిరి' వేయిస్తాననంటోంది. అదీ చూద్దాం!" అనుకుని, ఆమె కోరిక ప్రకారం మగ బిడ్డను ప్రసాదించాడు - పందిరికోసం ఆశపడి!!

మగబిడ్డ కలిగిన వెంటనే పేరమ్మ బారసాలనాడు "కృష్ణ" అని పేరుపెట్టి, బారసాలనాడు బిడ్డతోసహా గుడికివచ్చి, "స్వామీ నాకోరిక తీర్చావు; నీకిచ్చిన మాట ప్రకారం "కృష్ణ" అని నీపేరే పెట్టాను. ఇక మిగిలిందల్లా "చిటికెల పందిరి!" ఇదిగో నిమిషంలో వేసేస్తాను," అంటూ పిల్లాడ్ని అక్కడ పడుకోబెట్టి, గుడి ఆవరణ అంతా తిరుగుతూ, స్తంభాలు పాత్తున్నట్లు, వాటిమీద వెదురు చాపల పందిరి వేస్తున్నట్లు, చిటికెలు వేస్తూ రెండు చెతులతో, తిరిగి తిరిగి అలిసిపోయి, కృష్ణుడి దగ్గరకువచ్చి "చిటికెలతో పందిరి వేసేశాను - బావుందా? ఇక వస్తాను!" అంటూ వెళ్లిపోతుంటే, రాతి రూపములోనున్న కృష్ణుడు నోరెళ్లబెట్టాడు - పిసినారి పేరమ్మ తెలివికి!!

